నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, గురువారం 18 జూలై 2024 | MEDAK

మెదక్ జిల్లా ఘనపూర్ ప్రాజెక్టులో నీటిమట్టం

రైతులకు సాగునీటి గోస

- చెరువులు, వాగుల్లోకి చేరని వరద నీరు
- మెదక్ జిల్లాలో వర్షాలు లేక పెరగని సాగు విస్తీర్ణం
- భూగర్భ జలాలు తగ్గడంతో వరిసాగు చేసేందుకు భయపడుతున్న రైతులు
- అడపాదడపా వర్షాలతో ఆగమవుతున్న కర్షకులు
- భారీ వర్షాల కోసం ఎదురుచూపు

నీళ్లు లేక ఎండిపోయిన మెదక్ జిల్లా ఘనపూర్ ఆయకట్టు కుడి కాల్వ

మెదక్ జిల్లాలో నీళ్లు రాకపోవడంతో బీడుగా ఉన్న పొలాలు

మెదక్, జూలై 17 (నమస్తే తెలంగాణ): వానకాలం సీజన్ ప్రారంభమై నెలన్నర రోజులు గడిచినా భారీ వర్షాలు పడక రైతులకు సాగునీటి గోస తప్పడం లేదు. మెదక్ జిల్లాలో ఈ సీజన్‌లో మోస్తరు వర్షాలే తప్పా భారీ వర్షాలు కురవలేదు. అంతేకాదు చెరువులు, వాగులు, ప్రాజెక్టులు పొంగలేవు. ప్రధాన చెరువుల్లో నీటి మట్టాలు కనిష్టానికి పడిపోయాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో భారీ వర్షాలు పడితే తప్పా చెరువులు, ప్రాజెక్టులు నిండే పరిస్థితే లేదు. గత సంవత్సరం ఈ సమయానికి చాలా చెరువుల్లో నీటి మట్టం పెరిగింది. ప్రాజెక్టులు, వాగులు పొంగిపొర్లిన సందర్భాలు ఉన్నాయి. ఈ సారి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో రైతులు వరి నాట్లు వేసేందుకు ముందుకు రావడం లేదు. జూలై రెండో వారం ముగియడంతో బోర్లను నమ్ముకొని పంటలు సాగు చేస్తున్నారు. ఇదిలా ఉండగా బోర్లు లేని చోట నారుమళ్లను రక్షించుకోవడానికి రైతులు బిందెలతో నీరు తెచ్చి పోస్తున్నారు. నారుమళ్లు ముదిరిపోతున్నా వర్షాభావ పరిస్థితుల్లో నాట్లు వేయడానికి రైతులు సాహసించడం లేదు. భారీ వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

అంచనా ఎక్కువ... సాగు తక్కువ

మెదక్ జిల్లాలో ఈ వానకాలం సీజన్‌లో 3.73 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. కానీ ఇప్పటి వరకు లక్ష ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. వానకాలం సీజన్ ప్రారంభమై నెల దాటినా సాగు ముందుకు కదలడం లేదు. బోర్లు ఉన్న వారు ఆరుతడి పంటలు సాగుచేస్తున్నారు. జిల్లాలో 3.27 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని అంచనా వేయగా, ఇప్పటి వరకు 45వేల ఎకరాల్లో మాత్రమే రైతులు వరి సాగు చేశారు. అత్యధికంగా పత్తి సాగు 37వేల ఎకరాలు సాగు చేయాల్సి ఉండగా, 32 వేల ఎకరాల్లో సాగు చేశారు. 1000 ఎకరాల్లో మొక్కజొన్న, 500 ఎకరాల్లో కందులు, 600 ఎకరాల్లో మినుములు, పెసర్లు, 200 ఎకరాల్లో కూరగాయ పంటలు సాగు చేశారు.

నిండని ప్రాజెక్టులు..చెరువులు

మెదక్ జిల్లాలో ఘనపూర్ ప్రాజెక్టు, రాయిన్‌పల్లి ప్రాజెక్టులు, చెరువులు, వాగులు ఉన్నాయి. భారీ వర్షాలు పడక ఘనపూర్ ప్రాజెక్టులోకి నీరు రాలేదు. దీంతో ప్రాజెక్టు కింద ఉన్న భూముల్లో వరి సాగు చేయలేదు. సుమారు 22వేల ఎకరాల్లో ప్రాజెక్టు కింద రైతులు పంటలు సాగు చేస్తారు. ప్రతి ఏడాది వానకాలంతో పాటు, రబీ సీజన్‌లో ఘనపూర్ ప్రాజెక్టు కింద రైతులు వరి నాట్లు వేసేవారు. ఈ వానకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో వరి నాట్లు వేయలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంజీరానదిపై కొల్చారం–పాపన్నపేట మండలాల మధ్య ఏడుపాయల ప్రాంతంలో 1905లో ఘనపూర్ మధ్య తరహా ప్రాజెక్టు నిర్మించారు. ఆనకట్ట పొడవు 2.337 అడుగులు కాగా, నీటి నిల్వ సామర్థ్యం 0.2 టీఎంసీలు. దీని పరిధిలో రెండు కాల్వలు (మహబూబ్‌నహర్, ఫత్తేనహర్) ఉండగా ఆయకట్టు విస్తీర్ణం 21,625 ఎకరాలు, మహబూబ్‌నహర్(ఎంఎన్) కెనాల్ పొడవు 42.80 కిలోమీటర్లు కాగా, దీని ద్వారా కొల్చారం, మెదక్, హవేళీఘనపూర్ మండలాల పరిధిలోని 18 గ్రామాల్లో 11,425 ఎకరాలకు సాగు నీరు అందుతోంది. ఫతేనహర్(ఎఫ్ఎన్) కెనాల్ పొడవు 12.80 కి.మీ కాగా, పాపన్నపేట మండలంలోని 11 గ్రామాల్లో 10,200 ఎకరాలకు సాగునీరు అందుతోంది. గత పదేళ్లలో ఘనపూర్ ప్రాజెక్టు కింద 21,625 ఎకరాల్లో వరి పంటలు సాగు చేసుకున్న రైతులు వానకాలంలో వరినాట్ల కోసం అరిగోస పడుతున్నారు. ఇలాంటి దుర్భర పరిస్థితి ఏనాడు రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ నెలాఖరు వరకు నాట్లు వేసుకోవచ్చు

జూలై నెల చివరి వరకు వరి నాట్లు వేసుకోవచ్చు. వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు తక్కువ సమయంలో చేతికి వచ్చే పంటలు సాగు చేయాలి. మెదక్ జిల్లాలో ఇప్పటి వరకు 45వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాం. ఆయా పంటలకు సంబంధించి రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నాం.

– గోవింద్, మెదక్ జిల్లా వ్యవసాయాధికారి

కాల్వ రాక ఇంకా నాటెయ్యలె...

నాకు పావు తక్కువ మూడు ఎకరాలు ఉంది. కాల్వ రాక ఇంకా నాటెయ్యలె. గత సంవత్సరం ఈపాటికి నాట్లేసినం. ఇప్పుడు కాల్వ ద్వారా నీరు రాక నాట్లు అట్లనే ఉన్నాయి. బోర్లకు ఏతామంటే కాలంగాక అవి పోస్తలేవు. ఇంకా 15 రోజుల కాలం ఉంది. నాటుపడ్తదో పడదో. కాలం కాదు.. కాల్వ రాదు. ఈ ఏడాది రైతులకు కష్టాలే...

– ఏంబరి బాలయ్య, కిష్టాపూర్, మెదక్ జిల్లా

వానలు పడ్తలేవు

నాకు ఎవుసమే ఆధారం. వానలు పడ్తలేవు, కాల్వ ఇడుస్తలేరు. కేసీఆర్ సారు ఉండగా కాల్వ ద్వారా నీళ్లు దండిగా వచ్చాయి. పంటలు పుష్టిగా పండినయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో కాలమూ కాదు, కాల్వ రాదు. మొగోడు అంటే కేసీఆర్. ఆయనకే అన్నీ సాధ్యం. పేదలకు మంచి చేస్తుండే.కాంగ్రెస్ నాయకులతోని ఏదీ కాదు.

– అత్యం కిష్టయ్య, కిష్టాపూర్, మెదక్ జిల్లా

ముఖ్యమంత్రి మాకు ఏం పెడుతుండు ?

నాకు భూమి లేదు. రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న. బోరు జర్రన్నిపోస్తది కొద్దిగా సాగు చేస్తున్న. కాల్వ రాకపోతే అది ఎట్లయినా పారదు. కేసీఆర్ ఉండగా కాల్వ గింత ఆగలె. కాల్వలు పాకురు వట్టినయి. ఇప్పుడు నీళ్లు లేవు. ఏం చేస్తుండు ముఖ్యమంత్రి మాకు. కేసీఆర్‌ను తిడుతుండు కాలం గడుపుతుండు. కేసీఆర్ ఉండగా పేదలం బతికినం.

–చాకలిరాములు, కౌలురైతు, రాంపూర్, మెదక్ జిల్లా

పటాన్‌చెరులో సమావేశంలో మాట్లాడుతున్న తన్నీరు హరీశ్‌రావు

మేమున్నాం..అధైర్యపడొద్దు

'గూడెం' పోయినా గుండె ధైర్యం కోల్పోవద్దు

- మహిపాల్‌రెడ్డికి మూడుసార్లు టికెట్ ఇచ్చి గెలిపించాం
- పటాన్‌చెరుకు నిధుల వరద పారించాం
- ఆయన పార్టీని వీడినంత మాత్రాన కోల్పోయేది ఏమీలేదు..
- కార్యకర్తలే బీఆర్ఎస్ బలం.. బలగం
- పటాన్‌చెరు బీఆర్ఎస్ పార్టీకి కంచుకోట
- మళ్లీ గులాబీజెండా ఎగరడం ఖాయం
- పార్టీని పూర్తిగా ప్రక్షాళన చేసుకుందాం
- ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ సర్కారు
- ఒక్క హామీ సరిగ్గా అమలు కావడం లేదు..
- పటాన్‌చెరులో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

పటాన్‌చెరు/రామచందాపురం,జూలై 17 : పటాన్‌చెరు ఎమ్మెల్యే పార్టీ నుంచి పోయినంత మాత్రాన బీఆర్ఎస్ క్యాడర్ గుండె ధైర్యం కోల్పోవాల్సిన పనిలేదని, తాము అన్నింటికి అండగా ఉంటామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పట్టణ పరిధిలో కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి నివాసంలో బీఆర్ఎస్ నాయకులను కలిసి ఆత్మస్థైర్యం చెప్పేందుకు బుధవారం హరీశ్‌రావు వచ్చారు. హరీశ్‌రావు రాక సమాచారం తెలియడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున సింధూ ఆదర్శ్‌రెడ్డి ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిందాబాద్, కేసీఆర్ జిందాబాద్ నినాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. మాజీ స్పీకర్ మధుసూదనచారి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి హరీశ్‌రావు విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం రావడం ఖాయమన్నారు. కార్యకర్తలకు ధైర్యం చెబుదామని తాను వచ్చానన్నారు. కానీ, వారే తనకు ధైర్యం చెబుతున్నారని అన్నారు. కొందరు ముఖ్యనాయకులకు కలిసేందుకు రామచంద్రాపురం వచ్చానని , తాను వస్తున్న వార్తతో పార్టీ శ్రేణులు మేమున్నామని కదలి వచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఎక్కడో లేదని, అది ప్రజలు, కార్యకర్తల హృదయాల్లో పదిలంగా ఉందన్నారు. కార్యకర్తలే బీఆర్ఎస్‌కు బలం, బలగం అన్నారు. మీరందరూ కష్టపడితేనే గూడెం మహిపాల్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచాడని, మూడుసార్లు ఆయన్ను ఎమ్మెల్యేగా చేసింది బీఆర్ఎస్ అన్నారు. వైసీపీ టికెట్ ఇవ్వని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ తల్లిలా దగ్గరకు తీసుకుని టికెట్ ఇచ్చి ఆయన్ను గెలిపించుకుందని గుర్తుచేశారు. పటాన్‌చెరుకు ఎలాంటి నిధులు కావాలని కోరినా ప్రాధాన్యత ఇచ్చి కేటాయించినట్లు గుర్తుచేశారు. నాడు సీఎం కేసీఆర్ చొరవ తీసుకుని పటాన్‌చెరు పారిశ్రామికవాడను అభివృద్ధికి మారుపేరుగా తీర్చిదిద్దారన్నారు. ఇంత చేసినా మహిపాల్‌రెడ్డి పార్టీ మారడం న్యాయమా..? నీకిది తగునా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఎమ్మెల్యే పోతే పార్టీ పోదన్నారు. పటాన్‌చెరులో మంచి కార్యకర్తలు ఉన్నారని, ఇక్కడ మళ్లీ ఎగిరేది గులాబీ జెండానే అని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు.

పటాన్‌చెరు బీఆర్ఎస్‌కు కంచుకోట..

పటాన్‌చెరు బీఆర్ఎస్ పార్టీకి కంచుకోట అని హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్‌ను దెబ్బతీయాలన్న వారే కాలగర్భంలో కలిసినట్లు గుర్తుచేశారు. కష్టాలు వస్తాయి, పోతాయని, మీరంతా ధైర్యంగా ఉండాలని క్యాడర్‌ను కోరారు. మీ బాధ్యత తాను తీసుకుంటానని, మిమ్మల్ని పువ్వుల్లో పెట్టి చూసుకుంటానని క్యాడర్‌కు హామీ ఇచ్చారు. పార్టీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసుకుందామన్నారు. మళ్లీ పారిశ్రామికవాడలో గులాబీ జెండాను ఎగురవేసే వరకు కష్టపడి పనిచేద్దామన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్నదంతా ప్రజలు చూస్తున్నారన్నారు. కేసీఆర్ పాలనను, రేవంత్‌రెడ్డి పాలనను పోల్చుకుంటున్నారన్నారు. పార్టీ మారితే రాళ్లతో కొట్టండి అన్న రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఎమ్మెల్యేల ఇండ్లకు వెళ్లి కండువాలు కప్పుతున్నాడని ఎద్దేవా చేశారు. ఉచిత బస్సు ప్రయాణం తప్పా ఏ ఒక్క హామీ అమలు కావడం లేదన్నారు. పటాన్‌చెరులో బీఆర్ఎస్‌కు మంచి నాయకులు ఉన్నారని, వారి నేతృత్వంలో పార్టీ మరింత బలోపేతం కావడం ఖాయమన్నారు. త్వరలో పటాన్‌చెరులో బీఆర్ఎస్ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తానని హరీశ్‌రావు తెలిపారు.

పటాన్‌చెరులో నిర్వహించిన సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

కార్యకర్తలే మా బలం: ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

పటాన్‌చెరులో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

కార్యకర్తలు మా బలం అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరులో బీఆర్ఎస్ పార్టీ పటిష్టంగా ఉందన్నారు. ఇక్కడ మూడుసార్లు బీఆర్ఎస్ పార్టీ గెలిచిందన్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పార్టీ మారితే పెద్దగా ప్రభావం ఉండదన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడకుండా ప్రజలకు అందుబాటులో ఉండి వాస్తవాలు తెలియజేయాలన్నారు. పార్టీ శ్రేణులకు తామంతా అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. సమావేశంలో మాజీ ప్రొటెం చైర్మన్ భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, శంకర్‌యాదవ్, కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, సింధూఆదర్శ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు రోజాబాల్‌రెడ్డి, లలితాసోమిరెడ్డి, తొంట అంజయ్యయాదవ్, వెంకటేశ్ గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీధర్ చారి, కొలన్ బాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చందు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పాండురంగాశ్రమంలో ప్రత్యేక పూజలు

సిద్దిపేట జిల్లా మర్కూక్ పాండురంగాశ్రమంలోని నిర్వహిస్తున్న కచేరి

మర్కూక్,జూలై17: సిద్దిపేట జిల్లా మర్కూక్ లోని పాండురంగాశ్రమంలో ఆషాఢ ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం గణపతిపూజ, లక్షపుష్పార్చన, అఖండ భగవన్నామ స్మరణ, సాదమండపంలో సంగీత, సాహిత్య, సాంస్కృతిక ప్రదర్శనలు భక్తజనులను కనువిందు చేశాయి. భగవన్నామస్మరణలు ,పాండురంగడి సంకీర్తనలతో పాండురంగక్షేత్రం తొలిఏకాదశి పర్వదినం రోజు భక్తులను మంత్రముగ్ధుల్నిచేసింది. గురువారం సామూహిక సహాపంక్తి భోజన వడ్డింపు కార్యక్రమం చేపట్టనున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పలువురు భక్తులు శ్రీపాండురంగస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పర్మినెంట్ ఏవో లేక అవస్థలు

- ఇన్‌చార్జి పాలనతో విసుగెత్తుతున్న రైతులు
- అందుబాటులో ఉండని వ్యవసాయాధికారులు
- సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల రైతులకు తప్పని ఇబ్బందులు

రాయపోల్‌లో రైతు వేదిక కార్యాలయం

రాయపోల్, జూలై 17: సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలో వ్యవసాయాధికారులు అందుబాటులేక రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. గతంలో జీలుగు విత్తనాలు అందించడంలో ఆ శాఖ అధికారులు పట్టించుకోలేదు. దీంతో అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చినప్పటికీ మండలానికి పర్మినెంట్ వ్యవసాయాధికారి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయం కోసం తగు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన అధికారులు మండలానికి ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు పోతున్నారో తెలియని పరిస్థితి నెలకొన్నది. గత సంవత్సరం నుంచి మండలానికి ఇన్‌చార్జి వ్యవసాయాధికారిని నియమించారు. దీంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. పర్మినెంట్ వ్యవసాయాధికారి లేక మండల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గజ్వేల్ ఏవోకు రాయపోల్ మండల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు క్లస్టర్ ఏఈవోలు గ్రామాలకు వచ్చినా రైతులకు ఫలితం లేకుండా పోతున్నది. వానకాలంలో రైతులు తీసుకోవాల్సిన సలహాలు, సూచనలు ఇచ్చేవారు కరువయ్యారు. ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేయాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉండే విధంగా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి మండలానికి పర్మినెంట్ ఏవోను నియమించాలని రైతులు కోరుతున్నారు.

- విచారణ జరిపి వెంటనే బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి
- ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- బాధిత రైతును పరామర్శించిన మాజీ మంత్రి

కిష్టయ్యకు న్యాయం జరగాలి

సిద్దిపేట జిల్లా ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం దవాఖానలో బాధిత రైతు తల్లిని ఓదారుస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ములుగు, జూలై 17: భూవివాదంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న బండి కిష్టయ్యకు న్యాయం జరగాలని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దమ్మక్కపల్లికి చెందిన బండి కిష్టయ్య భూవివాదంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం దవాఖానలో చికిత్సపొందుతున్నాడు. బుధవారం బాధిత రైతును ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆయన పరామర్శించి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ...బండి కిష్టయ్య తన భూమికి హద్దులు చూపించాలని సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకోగా సర్వేకు వచ్చిన డీఐ మొదట సరిహద్దులు చూపి తర్వాత కాంగ్రెస్ నేతల సూచనలతో సరిహద్దులు మార్చి పొలానికి దారి లేకుండా ఇబ్బందులకు పెట్టి రూ. 20లక్షలు డిమాండ్ చేసినట్లు తెలిసిందన్నారు. కాంగ్రెస్ నేతల అండదండలు ఉన్నాయని మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు మీరు ఎక్కడికి వెళ్లినా న్యాయం జరగదని బెదిరించి అన్యాయంగా పోలీస్ కేసు నమోదు చేయించి ఇబ్బందులకు గురి చేశారన్నారు. రాష్ట్రంలో అనేక చోట్ల కాంగ్రెస్ నేతల సపోర్టుతో అనేక దౌర్జన్యాలకు పాల్పడి నిరుపేద రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడిషనల్ కలెక్టర్ స్థాయి అధికారితో విచారణ జరిపించి బాధిత రైతుకు న్యాయం చేసి ఆత్మహత్యాయత్నానికి కారకులైనవారిని కఠినంగా శిక్షించాలని సీఎంను డిమాండ్ చేశారు. అధికారులపై ఒత్తిడి చేసిన కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయాలని డీజీపీని కోరారు. అంతకుముందు సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరితో ఫోన్‌లో మాట్లాడి విచారణ జరిపి బాధిత రైతుకు న్యాయం చేయాలని కోరారు. ఆయన వెంట అంజిరెడ్డి, జుబేర్‌పాషా, అనంతుల ప్రశాంత్, కూడూరి భూపాల్‌రెడ్డి, ఏనుగు బాపురెడ్డి, ఏనుగు రాజేందర్‌రెడ్డి, మహేశ్ యాదవ్, మల్లేశ్‌యాదవ్ ఉన్నారు.

లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం దవాఖానలో బాధిత రైతు ఆరోగ్యం గురించి డాక్టర్లను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

నూతన భవనంలోకి..

కొమురవెల్లి పీఎస్

కొమురవెల్లి, జూలై 17: సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఎస్సై లింగంపల్లి రాజుగౌడ్ సేవలు ప్రారంభించారు. కొమురవెల్లి మండలం ఏర్పాటైన తర్వాత పోలీస్‌స్టేషన్‌ను మల్లన్న ఆలయ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేశారు. శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇస్తూ నాటి కేసీఆర్ ప్రభుత్వం పోలీసు స్టేషన్‌కు స్థలం కేటాయించడంతో పాటు రూ.కోటి నిధులు ఖర్చుచేసి మోడల్ పోలీస్ స్టేషన్‌ను నిర్మించింది. పోలీస్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తయి ప్రారంభించే సమయంలో నాడు కొమురవెల్లిలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై చంద్రమోహన్‌యాదవ్ బదిలీ కావడంతో పాటు ఎన్నికల కోడ్ రావడంతో పోలీస్‌స్టేషన్‌లో సేవలు ప్రారంభించలేదు. తర్వాత నూతన ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మరోసారి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీస్‌స్టేషన్ సేవలు ప్రారంభించలేదు. ఇటీవల 'నమస్తే తెలంగాణ'లో రూ.కోటి వెచ్చించి నిర్మాణం మరిచారు. అనే శీర్షిక వార్త ప్రచురితం కావడంతో ఇటీవల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన లింగంపల్లి రాజుగౌడ్ బుధవారం మల్లన్న గెస్ట్‌హౌస్‌లో ఉన్న పోలీస్ స్టేషన్ సామగ్రిని నూతన పోలీస్ స్టేషన్‌కు మార్చి పోలీస్ సేవలు ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చారు.

కొమురవెల్లి నూతన పీఎస్‌లో సేవలు ప్రారంభించిన తర్వాత ఎస్సై రాజుగౌడ్‌ను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

దివ్యాంగుల హక్కుల చట్టాన్ని అమలు చేయాలి

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రవికుమార్

పటాన్‌చెరు, జూలై 17: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే 2016 దివ్యాంగుల హక్కుల చట్టాన్ని అమలు చేయాలని రాష్ట్ర మస్క్యులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మడపతి రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లోని కండల క్షీణత వ్యాధి బాధితుల సంఘం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి తీవ్ర వైకల్యం ఉన్న దివ్యాంగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్ర వైకల్యంతో బాధపడుతున్న వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. 2016 దివ్యాంగుల హక్కుల చట్టం ప్రకారం తీవ్ర వైకల్యం ఉన్న దివ్యాంగులు, కండర క్షీణత, వెన్నెముక్క బాధితులకు రూ.15 వేల పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2023 ఎన్నికల మ్యానిఫెస్టోలో 2016 దివ్యాంగుల చట్టాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఇస్నాపూర్ ది వ్యాంగుల సంఘం అధ్యక్షుడు కంచిగారి మహేశ్, కార్యదర్శి కంజర్ల జ్యోతి, కంచిగారి శ్రీనివాస్, సాయిలు, బుజ్జి, దివ్యాంగులు పాల్గొన్నారు.

పనిచేయని సీసీ కెమెరాలు

- సిద్దిపేట జిల్లా మల్లన్న మహామండపంలో చోరీ ఘటన
- భయాందోళనలో మల్లన్న ఆలయ ఉద్యోగులు, సిబ్బంది
- కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిన పోలీసులు

కొమురవెల్లి ఆలయంలో చోరీ యత్నం జరిగిన ప్రదేశంలో పని చేయని కెమెరా

చేర్యాల, జూలై 17: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామి హుండీల లెక్కింపులో బంగారు గొలుసు చోరీ చేసి చెత్తబుట్టలో వేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. దీంతో ఆలయ ఈవో బాలాజీ సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బుధవారం మల్లన్న ఆలయంలో ఉన్న సీసీ కెమెరాలు, వాటి పనితీరు ఎలా ఉంది..అనే కోణంలో విచారణ ప్రారంభించడంతో ఆలయ ఉద్యోగులు, సిబ్బంది భయాందోళనలో ఉన్నారు. హుండీల లెక్కింపుల్లో చోరీకి యత్నం విషయంలో దేవాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ హనుమంతరావు సైతం తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలిసింది. కమిషనర్‌కు పలువురు వాట్సాప్‌లు పంపించడంతో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉద్యోగం నుంచి తొలిగించాలని ఆలయ ఈవోకు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. ఆలయ వర్గాలు కేవలం బంగారు గొలుసు చోరీకి యత్నం జరిగిందని అంటుండగా ఉంగరం సైతం ఎత్తుకుపోయారని పలువురు తెలుపుతున్నారు.

పని చేయని సీసీ కెమెరాలు

ఆలయంలో మొత్తం 40 సీసీ కెమెరాలు ఉండగా అందులో 32 కెమెరాలు మాత్రమే పని చేస్తున్నాయి. ఆలయ మహా మండపంలో కేవలం నాలుగు కెమెరాలు ఉండగా అందులో ఒక కెమెరా సక్రమంగా పని చేస్తుండగా, మరో రెండు కెమెరాలు ఏర్పాటు చేసిన దిశలో కాకుండా మరో యాంగిల్‌లో పనిచేస్తున్నాయి. హుండీల లెక్కింపు సందర్భంగా బంగారు, వెండి ఆభరణాలు తీసుకొచ్చి ఆలయ అధికారులు, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్, తదితరులు కూర్చొని చోట ఉన్న ట్రేలలో భద్రపరుస్తారు. వచ్చిన ఆభరణాలను తూకం వేసిన అనంతరం వాటి బరువు తదితర వివరాలను రికార్డులో నమోదు చేస్తుంటారు. ఈ ప్రదేశాన్ని కవర్ చేస్తూ రికార్డు చేసే సీసీ కెమెరాలు కొన్ని మాసాలుగా పని చేయడం లేదు.

నిందితులను పట్టుకుంటాం..

కొమురవెల్లి మల్లన్న ఆలయంలో హుండీల లెక్కింపులో చోరీకి యత్నించిన వ్యక్తులను మూడు రోజుల్లో పట్టుకుంటామని పోలీసు వర్గాలు తెలిపాయి. పీసీలు విచారణ ప్రారంభించారని, చోరీకి యత్నించిన వ్యక్తిని గుర్తించి రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు.